క్లుప్తంగా

పెద్దమ్మకు పూజలు



దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూల పెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం పెద్దమ్మ తల్లీ దీవించు అంటూ అభిషేకాలు, హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు అమ్మవారికి మొక్కుగా చెల్లించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎంటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

కుందూలో పెరిగిన నీటి ఉధృతి



క్రిష్టిపాడు వద్ద వంతెనను తాకుతూ ప్రవహిస్తున్న నీరు

దొర్నిపాడు: ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు కుందూనదిలో నీటి ఉధృతి భారీగా పెరిగింది. ఉదయం రైతులు పొలాలకు వెళ్లే సమయంలో వంతెనకు మూడు అడుగుల కింద పారుతున్న నీరు.. సాయంత్రానికే వచ్చే సరికి వంతెనను తాకుతూ ప్రవహించాయి. ఇంకా నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. దీంతో వంతెనపై రాకపోకలు నీటి ఉధృతిని బట్టి కొనసాగించాలని గ్రామ రెవెన్యూ అధికారి సాంబశివుడు హెచ్చరించారు.

ముమ్మరంగా విత్తన పత్తి క్రాసింగ్ పనులు



క్రాసింగ్ పనులు చేస్తున్న మహిళలు

దొర్నిపాడు: మండలంలో విత్తన పత్తి క్రాసింగ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దొర్నిపాడు, చాకరాజువేముల, బుర్రారెడ్డిపల్లె, డబ్ల్యూ. కొత్తపల్లె, డబ్ల్యూ. గోవిందిన్నె, రామచంద్రాపురం, క్రిష్టిపాడు గ్రామాల్లో విత్తన పత్తిని అధికంగా సాగుచేశారు. 1022 హెక్టార్లలో విత్తన పత్తిని సాగుచేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలు పంటకు మేలు చేకూర్చినప్పటికీ పత్తి కాయలు మాత్రం నేలరాలాయని రైతులు వాపోతున్నారు.

ప్రో వాలీబాల్ పోటీలు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని గురురాజ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఇంట్రా స్కూల్ ప్రో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఆదివారం జరిగిన పోటీలను విద్యాసంస్థల చైర్మన్ దస్తగిరిరెడ్డి, డాక్టర్ రవికృష్ణ, ఫిరోజ్ ప్రారంభించారు. క్రీడాకారులను 14 బృందాలుగా ఏర్పాటు చేసి పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు ట్రోఫీతో పాటు మెడల్స్ అందజేశారు. ఏపీటీ స్టేట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏపీ రెడ్డి, దండె నాగరాజు, దివాకర్, లింగమయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): బదిలీపై కర్నూలు జిల్లాకు వెళ్తున్న గడివేముల తహసీల్దార్ విద్యాసాగర్‌ను సన్మానించారు. ఆర్డీఓ కార్యాలయంలో ఆదివారం ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి సీఎస్‌డీటీ ప్రసాదరావు ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్లు విద్యాసాగర్‌కు శాలువా, బొకేలతో అభినందనలు తెలిపారు. మ్యూచువల్ బదిలీల్లో భాగంగా విద్యాసాగర్ కర్నూలుకు వెళ్తుండగా కర్నూలు నుంచి వెంకటరమణ నంద్యాల జిల్లాకు రానున్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండల తహసీల్దార్‌గా విద్యాసాగర్ విధులు నిర్వహించనుండగా వెంకటరమణకు ఇంకా మండలాన్ని కేటాయించలేదని సమాచారం.

పునశ్చరణకు ట్యూషన్ దోహదం

నంద్యాల(న్యూటౌన్): పిల్లల్లో మంచి అలవాట్లను నేర్పడానికి, పాఠ్యాంశాల పునశ్చరణకు ట్యూషన్ దోహదపడుతుందని ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ క్రాంతి చైతన్య, నవనంది విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు రామరాజు, శంకరయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని రైల్వే గూడ్ షెడ్ ఏరియాలో ఏకే గోపాల భవన్‌లో పేద పిల్లలకు ఉచిత ట్యూషన్ సెంటర్‌ను గుండె జబ్బుల ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ క్రాంతిచైతన్య ప్రారంభించారు. నంది విజ్ఞాన కేంద్రం నాయకులు భాస్కర్, నాగేంద్ర, ప్రసాద్, జనవిజ్ఞాన వేదిక నాయకులు గోపాల్, రమణ, చిన్నయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎంఆర్‌నాయక్ పాల్గొన్నారు.

- తెలుగుగంగ 19వ బ్లాక్ మైనర్ కాల్వకు గండి
- 55 రోజులైనా పట్టించుకోని పాలకులు, అధికారులు
- సాగు నీటి కోసం రైతులకు తప్పని అగచాట్లు

రైతుల గోడు పట్టదా?



అప్పనపల్లె వద్ద తెలుగుగంగ 19వ బ్లాక్ మైనర్ కాల్వకు పడ్డ గండి



గుంతలో నీటిని ఆయిల్ ఇంజన్లతో పారించుకుంటున్న దృశ్యం

రుద్రవరం: రైతుల సమస్యల పరిష్కారంపై ప్రజా ప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. తెలుగుగంగ 19వ బ్లాక్ కాల్వకు గండి పడి 55 రోజులైనప్పటికీ పూడ్చలేదు. కాల్వలో వచ్చే నీరు గండి నుంచి వృథాగా పోతుండటంతో దిగువకు పారడంలేదు. దీంతో పంటలకు సాగు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

చందాలు వేసుకొని గండి పూడ్చుకున్న రైతులు

వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి అధికారులు ఆగస్టు 1వ తేదీన తెలుగుగంగ ప్రధాన, ఉప ప్రధాన కాల్వలకు దాదాపు 5వేల క్యూసెక్యుల నీటిని విడుదల చేశారు. కాల్వల్లో నీటి ప్రవాహ ఉధృతికి మండల పరిధిలోని శ్రీరంగా పురం వద్ద 17వ బ్లాక్ మైనర్‌కాల్వకు గండి పడింది. అలాగే అప్పనపల్లె వద్ద 19వ బ్లాక్ మైనర్ కాల్వకు గండి పడింది. శ్రీరంగాపురం వద్ద కాల్వకు పడిన గండిని రైతులనే పూడ్చుకోండి బిల్లు వచ్చినప్పుడు ఇస్తామని చెప్పడంతో ఆ గ్రామానికి చెందిన పలువురు రైతులు చందాలుగా వేసుకొని ఇటీవల జేసీబీతో గండిని పూడ్చుకున్నారు.

మట్టిసంచులు వేసిన నాలుగు రోజులకే మళ్లీ గండి..

అప్పనపల్లె వద్ద గండి పడిన నాలుగైదు రోజుల్లో అధికారులు మట్టి సంచులు అడ్డుకట్టగా వేసి వెళ్లారు. వారు వెళ్లిన గంటకే మట్టి సంచులు కొట్టుకు పోయి మళ్లీ గండి పడింది. నాటి నుంచి ఆ గండిని పట్టించుకునేవారే కరవయ్యారు. దీంతో దిగువన ఉన్న ఆయకట్టు రైతులకు సాగు నీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. తప్పని పరిస్థితుల్లో ఇరుగు పొరుగన ఉన్న బోర్ల నుంచి, దూరంగా గుంతల్లో, కాల్వల్లో నిల్వ ఉన్న నీటిని ట్రాక్టర్లు, ఆయిల్ ఇంజిన్ల సాయంతో పారించుకొని సాగు చేసిన మొక్కజొన్న, మినుము, పత్తి, వేరుశనగ వంటి పంటలకు తడులు అందిస్తున్నారు.



రైతులు చందా వేసుకొని శ్రీరంగాపురం వద్ద గండిని జేసీబీతో పూడ్చుతున్న దృశ్యం

ప్రభుత్వంపై ఆశలు సన్నగిల్లాయి



రైతు సమస్యలపై ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడంలేదనడానికి కాలువకు పడిన ఓ చిన్న గండి పూడ్చించలేక పోవడమే నిదర్శనం. ఓ వైపు వర్షా భావ పరిస్థితులు నెలకొన్నాయి. లక్షలాది రూపాయలతో పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేశాం. పదడుగుల దూరంలో కాలువ ఉన్నా గండి పడి ఉండటంతో పంటలకు నీరు పారించుకోలేక పోతున్నాం. ప్రభుత్వంపై ఆశలు సన్నగిల్లాయి. ఓపిక నశించి విషయాన్ని గట్టిగా తెలుగుగంగ అధికారులను అడాగ్గా రైతులనే పూడ్చుకోమన్నారు. చేసేదిలేక తలా ఇంత చందాలుగా వేసుకొని గండిని పూడ్చి నీరు పారించుకోవాల్సి వచ్చింది.

– మధు, రైతు శ్రీరంగాపురం

పెట్టుబడి భారం పెరిగింది



19వ బ్లాక్ మైనర్ కాల్వకు దగ్గరలోనే 14 ఎకరాల పొలం ఉంది. ఆ పొలంలో వరి, మొక్కజొన్న పంటలు సాగు చేశా. గతంలో మైనర్ కాల్వ నుంచి సాగునీరు సమస్య లేకుండా పొలానికి పారేది. ఇప్పుడు గండి పడటంతో ఆ కాల్వలో నీరు పారడంలేదు. పొరుగు రైతుల బోరు మోటర్ నుంచి ఒక తడి పారించుకున్నా. మరో తడి పారించుకునేందుకు అవకాశం లేదు. చేసేది లేక కాస్త దూరంగా చిన్న గుంతలో నిల్వ ఉన్న నీటిని ఆయిల్ ఇంజిన్ ద్వారా పారించుకుంటున్నా. డీజిల్ ఇంజిన్, పైపుల బాడుగ తడిసి మోపెడవుతోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి గండిని పూడ్చి ఉంటే కష్టాలు, భారం తగ్గేవి.

– కొండయ్య, రైతు అప్పనపల్లె

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చని వెల్లడించారు. రెవెన్యూ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

12వ పీఆర్సీ అమలు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): 12వ పీఆర్సీని వెంటనే అమలు చేయాలని కోరుతూ ఆదివారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ 2023 జూలై 1 నుంచి అమలు కావాల్సిన పీఆర్సీని ప్రభుత్వం అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్య మాట్లాడుతూ పీఆర్సీ, డీఏ బకాయిలను, రెండు సంవత్సరాల నుంచి ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్న సంపాదిత సెలవుల బకాయిలు, ప్రావిడెంట్ ఫండ్ లోన్లు, ఫైనల్ పేమెంట్లే, ఏపీజీఎల్ఐ మెచ్యూరిటీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ భాస్కరరెడ్డి , జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు జాకీర్‌హుసేన్, నాగార్జున, మధు, సుబ్బారెడ్డి, పుల్లయ్య పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

శిరివెళ్ల: గుంప్రమాన్‌దిన్నె గ్రామానికి చెందిన కల్యాణకుమార్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న పీరయ్య ఆదివారం తెలిపారు. కోటపాడుకు చెందిన ఓ వివాహితను వివాహం చేసుకుంటానని చెప్పి అక్రమ సంబంధం పెట్టుకున్నాడన్నారు. అయితే వివాహం చేసుకోకుండా మోసం చేశాడని మహిళ ఫిర్యాదు చేసిందని చెప్పారు.

రౌడీయిజం చేస్తే కఠిన చర్యలు



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ రవికుమార్

శిరివెళ్ల: రౌడీయిజం చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ రవికుమార్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతు గ్రామాలలో శాంతి భద్రలకు విఘాతం కల్పిండం, సామాన్య ప్రజలను భయపెట్టడం మానుకోవాలన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానులేనన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని రౌడీ షీటర్లను హెచ్చరించారు. నేరప్రవృత్తిని మానుకోకపోతే పీడీ యాక్ట్ పెట్టేందుకు కూడా వెనుకాడమన్నారు. కార్యక్రమంలో సీఐ వంశీధర్, ఎస్ఐ చిన్న పీరయ్య పాల్గొన్నారు.

పోరాట స్ఫూర్తికి ప్రతి రూపం ఏపీటీఎఫ్



మాట్లాడుతున్న హృదయరాజు

నంద్యాల(న్యూటౌన్): పోరాట స్ఫూర్తికి ప్రతి రూపం ఏపీటీఎఫ్ అని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు అన్నారు. ఆదివారం పట్టణంలోని రామకృష్ణ పీజీ కళాశాల ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 80 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యా, వైజ్ఞాన మహాసభలు నిర్వహించడం శుభ పరిణామమన్నారు. జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి అధ్యక్షతన జరిగిన సభలో హృదయరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాట సంస్థగా పేరుగాంచిందన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వ, విద్యారంగ పరిరక్షణకు, సమాజ శ్రేయస్సుకు నిరంతరం పాటు పడటం గర్వించదగ్గ విషయమన్నారు. ఆటంకంగా ఉన్న యాప్‌లను తొలగించి, పరీక్షలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. అక్టోబర్ 6, 7, 8 తేదీల్లో విజయనగరంలో జరిగే 20వ విద్యా, వైజ్ఞానిక రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్, రాష్ట్ర కార్యదర్శి మధుసూదన రావు, ప్రధాన కార్యదర్శి నగరి శ్రీనివాసులు, రాష్ట్ర ఎన్నికల కమిటీ సభ్యులు రామకృష్ణయ్య, అడక్ కమిటీ సభ్యులు సాంబశివుడు, జిల్లా గౌరవాధ్యక్షులు శంకర్, పీఈటీ అసోసియేషన్ కార్యదర్శి బత్తుల రవికుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలి



మాట్లాడుతున్న గోపాలకృష్ణ

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలని కోరుతూ ఆదివారం ఎస్‌టీయూ నంద్యాల జిల్లా కార్యాలయంలో మౌలాలి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎస్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా ఉపాధ్యాయులకు యాప్‌ల భారం పెరుగుతుందని, జిల్లాలో చాలా చోట్ల మరుగుదొడ్ల యాప్ వినియోగం ఉపాధ్యాయులతో నిర్వహించేలా చేస్తున్నారన్నారు. ప్రభుత్వాలు ఎన్ని ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ అమలు కావడం లేదన్నారు. జిల్లా అధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో నంద్యాల మండల ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి, సోమయ్య, మనోహర్‌రెడ్డి, ప్రభాకర్, మధుసూదన్ పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

శిరివెళ్ల: ఈ నెల 20న పురుగు మందు తాగిన ప్రకాశం జిల్లా రాచర్లకు చెందిన సిద్ధార్థ (30) ఆసుపత్రిలో చికిత్స పొందరూ కోలుకోలేక మృతి చెందాడని స్‌ఐ చిన్న పీరయ్య ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. సిద్ధార్థ ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో ఈ నెల 20న నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీ సర్వనరసింహస్వామి ఆలయ పరిసరాలలో పురుగు మందు సేవించాడు. మందు సేవించిన వెంటనే బంధువులకు ఫోన్లో సమాచారం ఇచ్చాడు. బంధువులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతు ఆదివారం మృతి చెందాడు. భార్య మేఘన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



ఆర్.పాంపల్లె సమీపంలో సీడుపత్తి పొలంలో సామూహిక భోజనం చేస్తున్న వ్యవసాయ కూలీలు

కబుర్లు చెప్పుకుంటూ.. సద్దులు తింటూ!



ఉయ్యాలవాడ గ్రామసమీపంలో కంది పొలంలో వ్యవసాయ కూలీల సామూహిక భోజనం

ఉయ్యాలవాడ : అప్పటి వరకు వారంతా పంట పొలాల్లో ఎవరి పనుల్లో వారు బిజీగా గడిపారు. మధ్యాహ్నం బువ్వ తినే వేళవడంతో అంతా చెట్టుకిందకు చేరారు. ఇంటి నుంచి తెచ్చుకున్న సద్దులను (గిన్నెలు) తెరిచి.. కబుర్లు చెప్పుకుంటూ నాలుగు ముద్దలు తిన్నారు. ఆ వెంటనే పనుల్లోకి వెళ్లిపోయారు. ఖరీఫ్ సీజన్‌లో మండలంలో మిరప, కంది, సీడుపత్తి తదితర పంటలు రైతులు సాగు చేశారు. పంటలో కలుపు పెరిగిపోవడంతో వాటిని తొలగించేందుకు, సీడు పత్తిలో క్రాసింగ్ చేసేందుకు మహిళా వ్యవసాయ కూలీలు ఆళ్లగడ్డ, రుద్రవరం, సంజామల, శిరివెళ్ల మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి ట్రాక్టర్లు, ఆటోలలో దాదాపు 1,200 మందికి పైగా ఉయ్యాలవాడ మండల చుట్టుపక్కల గ్రామాల్లో పనులు చేసేందుకు వస్తున్నారు. వారు నివాసం వుండే ప్రాంతాలలో పనులు లేక కడుపు చేత పట్టుకుని జీవనభృతి కోసం తరలి వస్తున్నారు. మధ్యాహ్నం సమయంలోవెంట తెచ్చుకున్న సద్దులు ఇలా సామూహికంగా కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ ఆరగించారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

రుద్రవరం: మండల పరిధిలోని తువ్వపల్లెకు చెందిన జైపాల్ అనే వ్యక్తి నుంచి 19 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వరప్రసాదు ఆదివారం తెలిపారు. కొద్ది రోజుల నుంచి ఆ వ్యక్తి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేశామన్నారు. నిందితుడు 19 మద్యం సీసాలతో పట్టు బడ్డాడని, కేసు నమోదు చేసి రిమాండుకు తరలించామని చెప్పారు.

కుమారస్వామికి విశేషపూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో ఆదివారం కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో తాళ్లపాక హరినారాయణ స్వామీజీ



మహానందికి వచ్చిన తాళ్లపాక హరినారాయణ స్వామిజీ

మహానంది: తాళ్లపాక అన్నమాచార్యుల వారి 12వ తరానికి చెందిన హరినారాయణ స్వామి, శిష్యులు ఆదివారం మహానందికి వచ్చారు. కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. స్థానిక అలంకార మండపంలో వారికి వేదపండితులు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి సత్కరించారు. అనంతరం గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలోని గంగ, గౌరీ సమేత మరకతలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కాగా ఆదివారం సెలవు రోజు కావడంతో పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు.

పర్యాటక రంగంపై విద్యార్థులకు పోటీలు

నంద్యాల(రూరల్): ఈనెల 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని కళాశాల, పాఠశాల విద్యార్థులకు వక్తృత్వ, క్విజ్, డ్రాయింగ్, పెయింటింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యాటక అధికారి సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పర్యాటకం, శాంతి అనే అంశంపై వక్తృత్వ పోటీ, ప్రముఖ పర్యాటక ప్రదేశాలపై డ్రాయింగ్ పోటీలు ఉంటాయన్నారు. ప్రపంచ, భారత్, ఆంధ్రప్రదేశ్ టూరిజంపైన క్విజ్ నిర్వహించడంతో పాటు విద్యార్థులు, యువకులకు ఒక నిమిషం నిడివి గల వీడియో, అలాగే జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలు పర్యాటకులకు తెలియజేస్తూ ఆకట్టుకునేలా 15 నుంచి 20 సెకండ్ల నిడివితో గల రీల్స్, వీడియోలు రూపొందించి సమర్పించాల్సి ఉంటుందన్నారు. వీటిలో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి 27వ తేదీన బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. 26న టూరిజం వీడియో, రీల్స్ సమర్పించాలని సూచించారు. వివరాలకు 7995087089, 8297098022ను సంప్రదించాలన్నారు.

పారిశుద్ధ్య మెరుగుతో ఆరోగ్యం



పారిశుద్ధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

గోస్పాడు: పారిశుద్ధ్య మెరుగుతోనే ఆరోగ్యం చేకూరుతుందని గోస్పాడు వైద్యాధికారి గోపాల్ అన్నారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పారిశుద్ధ్య కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే ఎక్కడ పడితే అక్కడ చెత్త చెదారం వేయరాదని సూచించారు.

ఆహార పదార్థాలను పరిశుభ్రంగా ఉంచాలి



మాట్లాడుతున్న వెంకటరాముడు

నంద్యాల(రూరల్): క్యాంటిన్, హోటళ్లలోని ఆహార పదార్థాలను, తిను బండరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఫుడ్ సేఫ్టీ అధికారి ఓరుగంటి వెంకటరాముడు సూచించారు. ఆదివారం పట్టణంలోని రిటైల్ మార్చెంట్ అసోసియేషన్ కార్యాలయంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంపై హోటల్ యజమానులు, రోడ్డు సైడ్ ఫుడ్ వ్యాపారులతో ఆహార పరిశుభ్రతపై జిల్లా ఆహార భద్రత అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఆహార భద్రత అధికారి కాశీంవలి, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి, రిటైల్ మార్చెంట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీనివాసులు

చాగలమర్రి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల కీడా మైదానంలో జిల్లా స్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పోటీలను ఇన్‌చార్జ్ హెచ్ఎం శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి యర్రగుంట్ల మహబూబ్‌బాషా మాట్లాడుతూ ఈ పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 40 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబరు 9, 10 తేదీలలో చాగలమర్రిలో జరిగే 53వ సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ పోటీలలో నంద్యాల జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రవీంద్రారెడ్డి, పీడీలు దాదాపీర్, షేక్షావలి, జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి కడ్డీ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

చెస్ జట్ల ఎంపిక పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని వివేకానందరెడ్డి ఆడిటోరియంలో ఆదివారం 15 సంవత్సరాల్లోపు ఓపెన్ బాలికల జిల్లా చెస్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. బాలుర విభాగంలో ఆళ్లగడ్డకు చెందిన గడ్డం శెట్టి రోహన్ ప్రథమ స్థానంలో నిలవగా నంద్యాలకు చెందిన శివకార్తికేయ, సుమంత్, వెంకట ముఖుల్, ఆనంద్ మూడు స్థానాల్లో నిలిచారని నిర్వాహకులు తెలిపారు. బాలికల విభాగంలో నిహారి వైష్ణవి ప్రథమస్థానం, శాలిని ద్వితీయ స్థానం, హారిక తృతీయ స్థానం, అకల్యా నాల్గవ స్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నారన్నారు. చెస్ సంఘం ఉపాధ్యక్షులు రాజా చక్రవర్తి, కోశాధికారి శ్రీనీష్, ఆర్బిటర్ నిర్వాహకురాలు సుజాత పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి క్రీడా పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని కేఎస్ఎం మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శివకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-14, 17 బాల్ బ్యాడ్మింటన్, రెజ్లింగ్, రోప్ స్కిప్పింగ్, టేబుల్ టెన్నిస్ క్రీడాంశాల్లో బాల, బాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు.

పురాణ శ్రవణంతో పాపహరణం



ప్రవచనాలు వినిపిస్తున్న హయగ్రీవాచారి

నంద్యాల(వ్యవసాయం): దేవీ భాగవతాన్ని పారాయణం చేయటం వలన కానీ వినటం వల్ల సర్వపాపాలు తొలిగిపోతాయని తిరుమల తిరుపతి దేవస్థానం వ్యాఖ్యత డాక్టర్ దీవీ హయాగ్రీవచారి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కోటవీధిలో వెలసిన శ్రీ రమాసమేత సత్యనారాయణ స్వామి దేవస్థానంలో దేవీ భాగవత ప్రవచనం కార్యక్రమం రెండవ రోజు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజభయం, శత్రుభయం, మహామారీభయం, దుర్భిక్షభయం లాంటివి ఈ పురాణ శ్రవణం వలన తొలగిపోతాయన్నారు. నదులలో గంగ, దేవుళ్లలో శివుడు, కావ్యాలలో రామాయణం, గ్రహాలలో సూర్యుడు, తారకలలో చంద్రుడు, మంత్రాల్లో గాయత్రి ఎంత గొప్పదో.. పురాణాల్లో దేవీభాగవతం అంతగొప్పదని చెప్పారు. ఇందులో సత్యవ్రతుడు అమ్మవారి దివ్యబీజాక్షర జపం వల్ల గొప్ప పండితుడై విశేష ఖ్యాతినొందినాడని వివరించారు. ఈఓ నాగప్రసాద్, చైర్మన్ యాడికి శ్రీదేవి, సురేష్ పాల్గొన్నారు.

మండల సర్వేయర్ బదిలీ

దొర్నిపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న సర్వేయర్ చిన్నమల్లయ్యను శిరివెళ్ల మండలానికి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన 2018 జూన్ 1 నుంచి ఇక్కడ విధులు నిర్వహిస్తూ వచ్చారు. ఎన్నో ఎళ్లుగా పెండింగ్‌లో ఉన్న వివాదాస్పద కొలతను ఆయన పరిష్కరించి మన్ననలు పొందారు. రెండు సార్లు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు కూడా అందుకున్నారు.